జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 19-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 619 పేజీలు: 4 వెల : రూ.7

## నేడు ఉగాది

*** కిటకిటలాడిన మార్కెట్ * ధగధగ మెరిసిన బంగారు, దుస్తుల షాపులు * ఆకాశాన్నంటిన మామిడి, కొబ్బరి, అరటి, తదితర పండ్ల ధరలు**

**శ్రీకాకుళం, మార్చి 18 (వార్త):** ఉగాది పండగ అంటేనే తెలుగు వారి పండగ.. కొత్త ఆరంభాలను సూచించే పండగ.. కొత్త నూతన సంవత్సరంగా కూడా చెబుతారు. ఈ నూతన సంవత్సరం ప్రారంభం శ్రేయస్సుతోపాటు ఆనందంతో ముందుకు సాగాలని.. అందరూ కుటుంబ సభ్యులతో ఉగాది పండుగను చేసుకుంటారు. మామిడి ఆకులతో ఇల్లన్ని తోరణాలు అల్లి.. ఇష్ట దైవాన్ని కొలుస్తారు. కొత్త దుస్తులు ధరిస్తారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని ఇంటిల్లిపాది స్వీకరిస్తారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేస్తారు. ఉగాది రోజున కొత్త వస్తువులు కొనడం ఆనవాయితీ. కొందరు బంగారం, మరికొందరు దుస్తులు, ఇలా ఎవరికి వారు తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేసుకుంటారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంతో పాటు పలు మండల కేంద్రాల్లోని బంగారం, దుస్తులు, ఎలక్ట్రానిక్ షాపులు విద్యుద్దీపాలతో ధగధగమెరుస్తున్నాయి. శ్రీకాకుళం పొట్టి శ్రీరాములు మార్కెట్, రైతుబజార్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. మామిడి కాయలు, వేపపువ్వు, మామిడి ఆకులు, ఇతర సామగ్రిని కొనుగోలు చేసే వారితో రద్దీగా మారింది.

**తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

తెలుగువారందరికీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలియజేశారు. ఉగాది అనేది రైతులకు ప్రత్యేకమైన పండుగ అని తెలిపారు. అన్నదాతల కొత్త ఆశలకు, ఆరంభాలకు, సంప్రదాయాలకు నాంది పలికే పండుగగా చెప్పుకొచ్చారు. ఉగాది పండుగ తనకు ఎప్పుడూ ప్రత్యేకమైనదని, తెలుగువారిలో కొత్త ఆనందాలు తెచ్చే పండుగల్లో ఉగాది ఒకటని అన్నారు. ఉగాది పర్వదినాన్ని అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ప్రజారంజక కూటమి పాలనలో అభివృద్ధి వైపు బలమైన అడుగులు వేస్తున్న సందర్భంలో ఈ నూతన తెలుగు సంవత్సరం రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేర్చి.. ఏడాది పొడవునా సుఖసంతోషాలను అందివ్వాలని ఆకాంక్షించారు.




### పీఎన్ కాలనీ సీసీ రోడ్డు పనుల్లో అక్రమాలు

* అసిస్టెంట్ ఇంజనీర్‌పై విచారణ * విజిలెన్స్ నివేదిక ఆధారంగా ప్రభుత్వ ఆదేశాలు * విచారణ అధికారి నియామకం * నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం




### దివ్యాంగ శక్తితో.. దివ్యాంగులకు లబ్ధి

* రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు దివ్యాంగులకు ఉచిత బస్సు * జిల్లాలో ఉన్న బస్టాండ్‌ల వద్ద బస్ పాస్ జారీ చేసే కౌంటర్లు * రాష్ట్రంలో గ్యాస్ సమస్య లేదు * రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * రాగోలులో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం



### అధికారులు అప్రమత్తంగా ఉండాలి

* డయేరియా వంటి ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలి * డ్రైనేజీల్లోని పాత పైపులను యుద్ధ ప్రాతిపదికన తొలగించండి * మంత్రి అచ్చెన్నాయుడు

లోపల పేజీల్లో



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# నేడు కాశీబుగ్గలో ఉత్తరాంధ్ర కవిత పోటీలు

**పలాస, మార్చి 18 (వార్త):** జన జాగృతి సాహితీ సాంస్కృతిక వేదిక సౌజన్యంతో కాశీబుగ్గ గురుకుల పాఠశాల ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు ఉత్తరాంధ్ర స్థాయి కవితా పోటీలు నిర్వహిస్తున్నామని అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్. కుమార్ నాయక్, బండారి కాళిదాసు తెలిపారు.ఈ కవితా పోటీల్లో పాల్గొనే సాహితీవేత్తలు వారి స్వీయ కవితను జనజాగృతి వ్యవస్థాపకులు టి.కృష్ణ మూర్తికి వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు.

ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి సాహితీ మిత్రులకు సాహితీ సింహ బిరుదును ప్రదా నం చేస్తూ పుష్పం, ఫలం, కలం, పొత్తం, శాలువా, జ్ఞాపిక, పుష్పమాల, పగిడి, ప్రశంసాపత్రం, ఉగాది పచ్చడితో సత్కరిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేస్తున్నామని కుమార్‌నాయక్ తెలిపారు. ఆసక్తి గల కవులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

## ఏపీ ఎన్జీవోస్ సమావేశం



**పలాస, మార్చి 18 (వార్త):** పలాస ఎంపీడీవో కార్యాలయంలో ఏపీ ఎన్జీవోస్ ఉద్యోగ సంఘాల నాయకులు, సభ్యుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలాస ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు బోనేల గోపాల్ మాట్లాడుతూ ఉద్యోగుల యొక్క సంక్షేమం, ఉద్యోగుల సభ్యత్వ నమోదు, ఇతర అంశాల పైన చర్చించడం జరిగింది. శ్రీకాకుళం జిల్లా ఎన్జీవోస్ జాయింట్ సెక్రెటరీ కొర్ల మన్మధరావు మాట్లాడుతూ ఉద్యోగ సమాచారం, పత్రిక ..ఉద్యోగుల జీవోలు, సంక్షేమము.. తెలియ పరిచే అంశాలు ఉంటుంది. కాబట్టి ప్రతి ఉద్యోగి ఈ పత్రికను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ బి ఉపేందర్ రావు, ఉపాధ్యక్షులు పి శ్రీనివాసరావు, ఆపరేటివ్ అధికారి దుర్గాప్రసాద్ పట్నాయక్, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ బాలు, మున్సిపల్ అధికారి ఉదయ శంకర్ పాత్రో,ట్రెజరీ అధికారి వాయులపల్లి త్రివేణి, పంచాయతీ అధికారి పి.సద్గుణబాబు, వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి కొర్ల కళ్యాణ్ చక్రవర్తి, డివిజనల్ పంచాయతీరాజ్ మల్లా శ్రీను, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మందస రైల్వేస్టేషన్‌లో ఇంటర్ సిటీ రైలు నిలుపుదల వాయిదా



**మందస, మార్చి 18(వార్త):** ఇంటర్ సిటీ రైలు నిలుపుదల వాయిదా పడిందని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన చెప్పారు. ఈ నెల 19(గురువారం)న మందస రోడ్ రైల్వే స్టేషన్ లో ఆగుతుందనుకున్న బరంపురం ఇంటర్ సిటీ రైలు నిలుపుదల వాయిదా పడిందన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చిన అనంతరం సమాచారం ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు గమనించగలరని దుర్యోధన కోరారు.

## సహజ వనరులను సంరక్షించాలి




**నరసన్నపేట, మార్చి 18(వార్త):** నరసన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ వనరుల పునర్వినియోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, వనరుల వినియోగంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. పి. లత మాట్లాడుతూ, ప్రకృతి మనకు ఉచితంగా అందించిన సహజ వనరులు అన్ని జీవులకు సమానంగా చెందుతాయని పేర్కొన్నారు. వాటిని బాధ్యతతో వినియోగించాల్సిన అవసరం ఉందని, దుర్వినియోగం చేయకుండా భవిష్యత్ తరాలకు సంరక్షించాలన్నారు. వనరుల పునర్వినియోగం (రీయూజ్), పునర్వినియోగం (రిసైక్లింగ్) వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శాంతి హేమ్, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

## రబీ పంటకు సాగునీటి కష్టాలు

**-వంశధార ఎడమ కాలువలో నీటి నిలుపుదలపై రైతుల ఆందోళన**



**సారవకోట, మార్చి 18(వార్త):** వంశధార ఎడమ కాలువ నుంచి ఏప్రిల్ మొదటి వారం వరకు సాగునీరు విడుదల చేయాలని సారవకోట మండలం బద్రి గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేస్తున్నారు. రబీ సీజన్‌లో వరి పంట కీలక దశలో ఉండగా నీటి సరఫరా నిలిపివేయడం వల్ల పంట నష్టపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బద్రి రెవెన్యూ పరిధిలో ఈ ఏడాది సుమారు 300 మంది కౌలు, చిన్న, సన్నకారు రైతులు 500 నుంచి 600 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉండి, మరో 20 రోజుల్లో కోతకు సిద్ధమయ్యే పరిస్థితి ఉందని రైతులు తెలిపారు. ఈ సమయంలోనే వంశధార అధికారులు హిరమండలం గొట్టా బ్యారేజీ నుంచి కాలువ ద్వారా నీటి సరఫరాను నిలిపివేశారని ఆరోపించారు. ఒక్కో ఎకరానికి ఇప్పటివరకు సుమారు రూ.30 వేల వరకు ఖర్చు పెట్టామని, ఇప్పుడు నీరు లేకపోతే పంట పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోయారు. పంట చేతికొచ్చే సమయంలో నీటి నిలుపుదల చేయడం అన్యాయమని, వెంటనే నీటి విడుదల పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరా లేకపోతే తమకు భారీ నష్టం వాటిల్లుతుందని, అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయకపోతే తీవ్ర చర్యలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

## కాశీబుగ్గ సచివాలయంలో నాగుపాము



**పలాస, మార్చి 18 (వార్త):** కాశీబుగ్గలోని పూజారి వీధి సచివాలయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సచివాలయ ఆవరణలో నాగుపాము సంచారం బుధవారం తీవ్ర కలకలం రేపింది. సచివాలయ ఆవరణలోకి దూరిన పామును చూసిన సిబ్బంది భయంతో తలుపులు వేసుకుని బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ అటవీశాఖ కు చెందిన హనుమాన్ నర్సింగ్ వైల్డ్ లైఫ్ స్నేక్ క్యాచ్చర్ ఓంకార్ త్యాడి వెంటనే అక్కడికి చేరుకుని చాకచక్యంగా పామును పట్టుకున్నాడు. అనంతరం కోసంగిపురం సమీపంలోని మయూరి నగర వనం మెండ్ ఫారెస్ట్‌లో సురక్షితంగా విడిచిపెట్టారు.

# ఎమ్మెల్యే ఆదేశాలతో.. అన్నక్యాంటీన్ ఆకస్మిక తనిఖీ



**పలాస, మార్చి 18 (వార్త):** "పేదవాడి ఆకలి కేక వినకూడదు" అనే స్వర్గీయ నందమూరి తారక రామారావు మహోన్నత ఆశయానికి, "ప్రతి పేదవాడి కడుపు నింపాలి" అనే నారా చంద్రబాబు నాయుడు సంకల్పానికి ప్రతిరూపం అన్నా క్యాంటీన్లు అని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు కొనియాడారు. కేవలం ఐదు రూపాయలకే నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందిస్తూ తెలుగుదేశం ప్రభుత్వం పేదల పక్షపాతిగా నిలిచిందని ఆయన అన్నారు. పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అన్నా క్యాంటీన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన క్యాంటీన్ నిర్వహణను, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. వంటశాలను, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తనిఖీ చేసి, నాణ్యతా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం, అక్కడ భోజనం చేస్తున్న పేదలతో నేరుగా మాట్లాడి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. "కేవలం 5 రూపాయలకే ఇంత మంచి భోజనం దొరకడం మా అదృష్టం సార్. ఇక్కడ అన్నం చాలా రుచిగా, శుభ్రంగా ఉంటుంది" అని వారు ఆనందం వ్యక్తం చేయగా, కామేశ్వరరావు భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం కామేశ్వరరావు మాట్లాడుతూ, "ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలతో ఈ రోజు ఇక్కడికి వచ్చానని, గత ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా మూసివేసిన ఈ క్యాంటీన్లను, మా ప్రభుత్వం తిరిగి ప్రారంభించి పేదలకు అండగా నిలిచిందని తెలిపారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా, చంద్రబాబు నాయుడు పాలనలో ప్రతి పేదవాడి ఆకలి తీర్చడమే మా ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. కేవలం 5 రూపాయలకే ఇంత శుభ్రమైన, రుచికరమైన భోజనం అందించడం మా ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నాం," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు మాజీ కౌన్సిలర్ గురుటి సూర్యనారాయణ రావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ సవర రాంబాబు, లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, బద్రి గోపాల్ రావు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తున్నాం

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**

**-దివ్యాంగ శక్తి' పథకానికి శ్రీకారం**




**పలాస, మార్చి 18 (వార్త):** రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ప్రారంభమైన 'దివ్యాంగ శక్తి' పథకం పలాస నియోజకవర్గంలో పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో జెండా ఊపి ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే గౌతు శిరీష. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకం ద్వారా దివ్యాంగ సోదర సోదరీమణులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, దివ్యాంగుల వారి సహాయకులకు 50% టిక్కెట్ రాయితీ కల్పించడం జరిగిందని తెలిపారు. మన నియోజకవర్గంలోని దివ్యాంగులందరూ ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని నేటినుంచి అమలు చేసిందని తెలిపారు. ఇప్పటికే మహిళా శక్తి పథకం ద్వారా. దివ్యాంగ మహిళలు ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణం చేస్తున్నారని, నేటి నుంచి 40% అంగవైకల్యం కలిగిన పురుషులు కూడా ఉచిత బస్సు ప్రయాణం అర్హులని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ నాయుడు, ఆర్డీవో అప్పలరాజు, పలాస, మందస, వజ్రపు కొత్తూరు మండలాల ఎంపీడీవోలు వసంత కుమార్, వెంకటరమణ, రమేష్ నాయుడు, పట్టణ టిడిపి కార్యదర్శి, అధ్యక్షులు సప్ప నవీన్, బడ్డ నాగరాజు, లోడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, జోగ మల్లి, డొక్కరి శంకర్, మల్లిపెద్ది చిన్ని, గురుటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించండి

**-తక్షణమేబి ఐక్యరాజ్యసమితి**

**జోక్యం చేసుకుని యుద్ధం ఆపాలి**

**పలాస, మార్చి 18 (వార్త):** ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ సామ్రాజవాదులు దురాక్రమణా దాడిని ఖండించాలని సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకా స్ పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక భ వనము వద్ద అమెరికన్ సామ్రాజవాదానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అమెరికా ప్రపంచ ఆధిపత్యం కోసం ఆయిల్ సంపద ఉన్న దేశాలపైన దండయాత్ర చేస్తుందని తక్షణమే ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని యుద్ధం ఆపాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ అనేక దేశాలలో సిఐఏ ఏజెంట్లు పెట్టి దేశాల అధినేతలను హత్యలు గావించి మా రణ హోమాన్ని అమెరికా సృష్టించిందని, అమెరికాకు భారత పాలకులు నరేంద్ర మోడీ దాహోమంటూ అమెరికా యుద్ధంలో భారతదేశం కూడా భాగస్వామ్యం చేస్తున్నారు. దుర్మార్గం అత్యంత ప్రమాదకరమైనదని, అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మూడో ప్రపంచాల పక్షాన భారతదేశం నిలబడాలని, అమెరికా చేస్తున్న యుద్ధం ఆపాలని, మోదీ ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ వియత్నామా అనేక దేశాల పైన దురాక్రమన దాడులు చేస్తూ ప్రపంచ ఆధిపత్యం కోసం ప్రపంచ మార్కెట్లను కొల్లగొట్టడానికి అమెరికా ఊళ్ళోరుతుందని, అమెరికన్ ఇండియన్ ట్రేడ్ అగ్రిమెంట్ పేరుతో భారతదేశం మార్కెట్ను కొల్లగొడుతుందని మండిపడ్డారు. ప్రపంచ శాంతి కొరకు యుద్ధం ఆపాలని, యుద్ధం భారాల మూడో ప్రపంచ దేశాలు ప్రజల పైన మన పైన పడుతుందని, తక్షణమే యుద్ధం ఆపాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు జుత్తు వీరాస్వామి, మామిడి భీమారావు, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, వంకల పాపయ్య, రాపాక మాధవరావు, మురిపిండి తాతారావు, జడ్డే అప్పయ్య, లండవల్లభరావు, సవర బంగ్లా కుమార్ పాల్గొన్నారు.




# పదవి ముగిసినా సేవ ఆగదు

**-10వ వార్డు ప్రజల రుణం జీవితాంతం**

**-మాజీ కౌన్సిలర్ గీతారవి భావోద్వేగ ప్రకటన**

**-ఐదేళ్ల సేవా ప్రయాణానికి ముగింపు**

**పలాస, మార్చి 18 (వార్త):** కాశీబుగ్గ పట్టణ రాజకీయాల్లో సేవే లక్ష్యంగా ముందుకు సాగిన 10వ వార్డు మాజీ కౌన్సిలర్ సర్వాన గీతారవి తన పదవీకాలం ముగిసిన సందర్భంగా భావోద్వేగ ప్రకటన చేశారు. ఐదేళ్లపాటు ప్రజలతో కలిసి నడిచిన తన సేవా ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ, వార్డు ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనను కౌన్సిలర్‌గా గుర్తించి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన 10వ వార్డు ప్రజలకు జీవితాంతం ఋణపడి ఉంటానని పేర్కొన్నారు. మునిసిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ప్రజల మనిషిగా సేవలు అందించినట్లు తెలిపారు. నామినేషన్ ఘట్టం అనంతరం ఎన్నికలు జరగాల్సిన సమయంలో కరోనా మహమ్మారి కారణంగా ఎన్నికలు నిలిచిపోవడం, ప్రజల సేవలు కూడా ఆగిపోవడం వంటి పరిస్థితులు ఎదురయ్యాయని చెప్పారు. అటువంటి క్లిష్ట సమయంలో నిరుపేదలకు స్వయంగా వంట చేసి ఇంటింటికి ఆహారం అందించిన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. పొందర వీధిలో స్వంత ఖర్చులతో కల్వర్టులు నిర్మించడం, జక్కర గుండం అభివృద్ధి చేయడం, మునిసిపల్ సాధారణ నిధులతో పలు ప్రాంతాల్లో పవర్ బోర్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించడం వంటి పనులను చేశారు. దెంకవీధి, పారసాంబ దళితవీధిలో పాడైపోయిన పాత బావులను పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త పోల్స్ ఏర్పాటు, దశాబ్దాలుగా ఉన్న రహదారి సమస్యలకు పరిష్కారం, పారసాంబ కోనేరు పూడిక తొలగింపు, స్నానాల రేవుల నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. హుద్ హుద్, తిత్లీ తుఫాన్ల వల్ల ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేసినట్లు వివరించారు. వార్డులో ఇల్లు లేని వారికి జగనన్న కాలనీల్లో ఇళ్లు కల్పించడం, నవరత్నాల పథకాలను అర్హులైన వారికి అందించడం వంటి సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసినట్లు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశామని తెలిపారు. తన వల్ల ఎవరికైనా ఇబ్బందులు కలిగితే పెద్ద మనసుతో క్షమించాలని వార్డు ప్రజలను కోరారు. ఇకపై పదవి లేకపోయినా ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. చివరిగా మరోసారి వార్డు ప్రజలకు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకు, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.




## బుడితిలో ముమ్మర పారిశుధ్య పనులు

**- డ్రైనేజీ సమస్యకు పరిష్కారం -ఎంపీపీకి గ్రామస్థుల కృతజ్ఞతలు**



**సారవకోట, మార్చి 18(వార్త):** సారవకోట మండలం కిడిమి పంచాయతీ పరిధిలోని బుడితి గ్రామంలో బుధవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో స్థానికులు ఇటీవల ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడుకు సమస్యను వివరించారు. ఈ సమస్యపై స్పందించిన ఎంపీపీ, పంచాయతీ మరియు సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలో శానిటేషన్ పనులు చేపట్టించారు. డ్రైనేజీలను శుభ్రపరచడం, చెత్తను తొలగించడం వంటి చర్యలు తీసుకోవడంతో గ్రామంలో పరిశుభ్రత మెరుగుపడింది. తమ సమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు గ్రామస్థులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి పారిశుధ్య పనులు నెలలో కనీసం రెండుసార్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేరికకు అడ్మిషన్ డ్రైవ్

**-ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన**




**నరసన్నపేట, మార్చి 18(వార్త):** వంశధార కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం హడ్కో కాలనీ ప్రాంతంలో విద్యార్థుల చేరికలను పెంచేందుకు అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు కూడా పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలుసుకున్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల భవిష్యత్తు కోసం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించిందని ఉపాధ్యాయులు తెలిపారు.

## నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డీఎస్పీ

**- కేసుల వేగవంతమైన పరిష్కారంపై దృష్టి సారించాలని ఆదేశాలు**

**నరసన్నపేట, మార్చి 18(వార్త):** నరసన్నపేట పోలీస్ స్టేషన్‌ను టెక్కలి సబ్‌డివిజన్ డీఎస్పీ లక్ష్మణరావు బుధవారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పనితీరును సమీక్షిస్తూ అధికారులతో సమావేశం నిర్వహించారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయన సీఐ శ్రీనివాసరావు, ఎస్సై గణేష్తో సమావేశమై నమోదైన కేసుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితిగతులను సమీక్షించి, వాటి పరిష్కారానికి వేగం పెంచాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం త్వరితగతిన అందించేందుకు కేసుల విచారణను వేగవంతం చేయాలని, ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, సమయానికి పరిష్కారం చూపాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సీఎం సహాయనిధి నుంచి లక్ష రూపాయల ఆర్థిక సాయం



**పోలాకి, మార్చి 18(వార్త):** పోలాకి మండలం అంపలాం గ్రామానికి చెందిన బొల్లు శ్రావణి అనారోగ్యానికి గురవడంతో వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా ప్రభుత్వం స్పందించి లక్ష రూపాయల ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ఈ దరఖాస్తును స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ద్వారా పంపించగా, ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయం అందించింది. మంజూరైన చెక్కును మంగళవారం రాత్రి టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం

### -'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించిన బగ్గు అర్చన




**నరసన్నపేట, మార్చి 18(వార్త):** దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన తెలిపారు. బుధవారం నరసన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో "దివ్యాంగ శక్తి" పథకాన్ని ఆమె ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 40 శాతం పైగా వికలాంగత ఉన్నవారికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలుకు కావాల్సిన ఖర్చులను ప్రభుత్వం భరిస్తోందని, సక్రమ అమలుకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులు మొత్తం ఐదు రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని వివరించారు. ఇప్పటి వరకు పరిమిత వర్గాలకు మాత్రమే ఈ సౌకర్యం ఉండగా, ప్రస్తుతం 21 వర్గాల దివ్యాంగులకు విస్తరించడం జరిగిందన్నారు. శారీరక, మానసిక, నాడీ సంబంధ వ్యాధులు మరియు ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ పథకం ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. అనంతరం బగ్గు అర్చన స్వయంగా దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి వారితో ముచ్చటించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, రాష్ట్ర పొందర, కూరాకుల కార్పొరేషన్ ఛైర్మన్ దామోదర నర్సింహులు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకట్రావు, వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ ఛైర్మన్లు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, కోరాడ నాగరాజు, పోలాకి పిఏసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బలగ భారతి, మండల పార్టీ అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గొద్దు చిట్టిబాబు, రావాడ కృష్ణారావు, పట్టణ అధ్యక్షులు కింజరాపు రామారావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు రావాడ గణపతిరావు, జిల్లా తెలుగు నాడు ఫెడరేషన్ అధ్యక్షులు బలగ ప్రహర్ష, తదితర ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, దివ్యాంగులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సీదిరి పరామర్శ



**పలాస, మార్చి 18 (వార్త):** పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు మండలం, వజ్రపుకొత్తూరు పంచాయతీ మాజీ సర్పంచ్ పోతనపల్లి లక్ష్మీకాంతం ఇటీవల శివైక్యం పొందారు. ఈ విషయం తెలుసుకుని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం స్వర్గీయ లక్ష్మీకాంతం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు మండలకు చెందిన వివిధ హోదాల్లో ఉన్న స్థానిక వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఎస్వీఎస్ఎస్ ఆర్థికసాయం



**మందస, మార్చి 18(వార్త):** మందస మండలంలోని రాంపురం పంచాయతీలోని ఉద్దాన గ్రామమైన బిడిమి గ్రామానికి చెందిన జుత్తు ప్రకాష్ ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలు విరిగిపోయింది. దీంతో ఆయన మంచానికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న స్వామి వివేకానంద సేవా సమితి ప్రతినిధులు ఆ కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేశారు. కుటుంబం పరిస్థితి చాలా పేదరికం కావడంతో ఆ నిరుపేద కుటుంబానికి మా తరపున నిత్యవసర సరుకులు అందజేయడం జరిగిందని వారు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న స్వామి వివేకానంద సేవా సమితి ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.

## విద్యార్థుల సామర్థ్యాలపై ఎంఈఓ ప్రత్యేక పరిశీలన

### -హోంవర్క్, బోధనలో నాణ్యత పెంపుపై సూచనలు

**జలుమూరు, మార్చి 18(వార్త):** జలుమూరు మండలం గోలియాపుట్టి ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఎంఈఓ-1 బమ్మిడి మాధవరావు బుధవారం పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న ఆయన నేరుగా విద్యార్థులతో మమేకమై పలు ప్రశ్నలు అడిగి వారి జ్ఞాన స్థాయిని అంచనా వేశారు. విద్యార్థుల స్పందనను పరిశీలిస్తూ చదువు పట్ల ఆసక్తి పెంపొందించే విధంగా బోధన జరగాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హోంవర్క్‌ను పరిశీలించిన ఆయన, పనితీరును మెరుగుపరచడానికి పలు సూచనలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుంప సుధారాణికు ప్రతిరోజు తప్పనిసరిగా హోంవర్క్ ఇవ్వాలని, విద్యార్థుల పురోగతిని నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని, సమర్థవంతమైన బోధన ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.





**మందస, మార్చి 18(వార్త):** ప్రభుత్వం సెర్ఫ్, నేషనల్ రూరల్ లైవ్లీ వుడ్ మిషన్ ద్వారా ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్రెనర్ కాన్సెప్ట్ ను అర్థం చేసుకొని అమలు పరచడం ద్వారా మహిళలు అంతా అభివృద్ధి చెందాలని వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ మందస అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మందస మండలంలోని హరిపురం పంచాయతీలోగల కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన హరిప్రియ మహిళా పరస్పర సహాయ సహకార గ్రామ సంఘం అధ్యక్షురాలు నల్లా శ్యామల కుమారి అధ్యక్షతన జరిగిన పాలక వర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి విజన్ డాక్యుమెంటరీ ప్రకారం ప్రతీ కుటుంబంలో మహిళా సంఘం నుండి తీసుకున్న రుణం సద్వినియోగ పరుచుకోవడం అంటే తన పెట్టుబడి యూనిట్ వల్ల తోటి మహిళలలో మిగతా వారికి కూడా ఉపాధి కల్పిస్తూ, గ్రామాలలో ఆదర్శంగా మహిళా సంఘాలు ఎదగాలని సూచించారు. షేడ్ నెట్ మొరింగా, కోరమేనా, డెయిరీ యూనిట్స్ పెట్టుకోవటానికి బ్యాంకు విల్లింగ్ తో పీఎంఈజీపీ రుణాలును ప్రభుత్వం మంజూరు చేస్తుందని వివరించారు. మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై ఎఫ్.ఎల్. లిటరసీ టీమ్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ మీనాక్షి, బాలకృష్ణతో పాటు వీఓఏ రాములమ్మ, గ్రామ సంఘం ప్రతినిధులు శ్యామలకుమారి, సంక చందన, గోకర్ల లత తదితరులు పాల్గొన్నారు.

# కార్య సాధకుడు.. గుసిరి వెంకటరావు

### -ప్రధాన రహదారిలో కల్వర్టు

### - రక్షణ గోడల నిర్మాణం

### -పదవి ముగుస్తున్నా అభివృద్ధికై తపన

### -రూ.4.5లక్షలతో అభివృద్ధి పనులు

**మందస, మార్చి 18(వార్త):** ఆయన నిత్య శ్రామికుడు.. అభివృద్ధి కామికుడు.. సంక్షేమమే పరమాధిగా పని చేసిన సర్పంచ్.. ప్రజల్లో ఎంతో మంచి నాయకునిగా గుర్తింపు తెచ్చుకున్న గుసిరి వెంకటరావు సర్పంచ్ గా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పదవి ముగుస్తున్నప్పటికీ, అభివృద్ధికి తపిస్తున్నారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న రహదారి, కల్వర్టులను నిర్మించి, పంచాయతీ ప్రజలతో పాటు.. పలు గ్రామాల ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. మందస మండలంలోని మూలిపాడు పంచాయతీ సర్పంచ్ గా గుసిరి వెంకటరావు మంచి మెజార్టీతో గెలుపొందారు. ఐదేళ్లుగా పంచాయతీ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం పాటుపడుతున్నారు. మరి కొద్ది రోజుల్లో పదవి ముగుస్తుంది. కానీ.. ఆయన అభివృద్ధి ఆరాటం మాత్రం కొనసాగుతోంది. మూలిపాడు గ్రామం నుంచి పెద్దచెరువు, ఎస్ఈబ్ల్యూపీసీ, శ్రీముక్తేశ్వరాలయంతో పాటు పింపిడియా, ఉప్పరిపేట తదితర గ్రామాలకు వెళ్లే ఈ రహదారికి ఎంతో ప్రాధాన్యత ఉంది. రహదారి అధ్వాన్నంగా ఉండడంతో బాగు చేయడానికి కంకణం కట్టుకున్నారు. పెద్ద పెద్ద పైపులు అవసరం కావడంతో ప్రత్యేకంగా వాటిని రప్పించి.. కల్వర్టు, రహదారి పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘంలో రూ.4.5లక్షల నిధులతో కల్వర్టు, గ్రావెల్ రహదారి, సైడ్ వాల్స్ నిర్మించి, సమస్యను పరిష్కరించారు.



దీంతో స్థానికులు, ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు సర్పంచ్ వెంకటరావును అభినందిస్తున్నారు.

# రైతన్న మీకోసం వారోత్సవాల్లో అవగాహన

### - రైతు సంక్షేమ పథకాలపై వివరించిన అర్చన

**నరసన్నపేట, మార్చి 18(వార్త):** గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "రైతన్నా మీకోసం" వారోత్సవాల సందర్భంగా నరసన్నపేట మండలం దేవాది గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పాల్గొని రైతుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా పలు పథకాలను అమలు చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి రైతు ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందరికీ చేరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, కోమర్తి నీటి సంఘం ఉపాధ్యక్షులు ధర్మాన అసిరినాయుడు, గొండు సూర్యారావు, బాయిరెడ్డి రామారావు, అలాగే కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నవోదయ పరీక్షల్లో కిరణ్మయికి పదో ర్యాంకు

### - నరసన్నపేట ప్రభుత్వ పాఠశాలకు గర్వకారణం



**నరసన్నపేట, మార్చి 18(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న యాల కిరణ్మయి ఇటీవల నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తూ పదో ర్యాంకు సాధించింది. మంగళవారం ఫలితాలు విడుదల కావడంతో బుధవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు నాయుడు, ఉపాధ్యాయురాలు సద్గుణాంబ అభినందించారు. చిన్న వయసులోనే కిరణ్మయి సాధించిన ఈ విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కిరణ్మయి తండ్రి అప్పలనాయుడు ఉపాధ్యాయుడిగా సేవలందిస్తుండగా, తల్లి గృహిణిగా కుటుంబాన్ని చూసుకుంటున్నారు. ఈ విజయంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## చెంచు నృత్య కళాకారుడికి ఉగాది పురస్కారం

### - ఆవాల జగన్నాథం ఎంపికపై గ్రామంలో ఆనందం



**నరసన్నపేట, మార్చి 18(వార్త):** నరసన్నపేట మండలం గుండివిల్లిపేట గ్రామానికి చెందిన చెంచు జాతి కళాకారుడు ఆవాల జగన్నాథంకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు ఏపీ టూరిజం, సాంస్కృతిక విభాగం అధికారులు పురస్కార గ్రహీతల జాబితాను విడుదల చేశారు. తనకు ఈ పురస్కారం లభించడం పట్ల జగన్నాథం ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి గ్రామంలో మాట్లాడుతూ, తమ పూర్వీకుల నుంచి వచ్చిన సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా తమ బృందంతో కలిసి చెంచు నృత్యాలు ప్రదర్శిస్తామని తెలిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో కూడా తమ కళాప్రదర్శన ఇచ్చినట్లు పేర్కొన్నారు. చెంచు సంప్రదాయ నృత్యాలను కాపాడుతూ వాటిని ప్రజలకు పరిచయం చేయడంలో జగన్నాథం చేసిన కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతిలో ఉగాది సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో జగన్నాథంకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఆయన విజయం గ్రామానికి గర్వకారణంగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు.

## నవోదయ పరీక్షల్లో ప్రతిభ చాటిన రిషితశ్రీ

### -రాష్ట్ర స్థాయిలో 31వ ర్యాంకు సాధన




**నరసన్నపేట, మార్చి 18(వార్త):** నరసన్నపేట పట్టణానికి చెందిన టెంక రిషిత శ్రీ నవోదయ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర స్థాయిలో 31వ ర్యాంకు సాధించింది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఈ విజయాన్ని నమోదు చేసి పట్టణానికి గర్వకారణంగా నిలిచింది. రిషిత శ్రీ తండ్రి సత్యనారాయణ మాట్లాడుతూ, ఆమె ప్రస్తుతం ఒక ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోందని తెలిపారు. చిన్న వయసులోనే ఈ స్థాయి ప్రతిభ కనబరచడం కుటుంబ సభ్యులకు ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ విజయంతో రిషిత శ్రీను తల్లిదండ్రులు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.

## తాగునీటి సరఫరా పునరుద్ధరించండి

### -వడ్డినవలస గ్రామస్థుల ఆవేదన

**సారవకోట, మార్చి 18(వార్త):** సారవకోట మండలం వడ్డినవలస గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామానికి చెందిన పలువురు మహిళలు, పురుషులు కలిసి మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) మోహన్ కుమార్ను కలిసి తమ సమస్యను వివరించారు. తాగునీటి కొరత కారణంగా రోజువారీ పనులు సైతం అంతరాయం కలుగుతున్నాయని, దూర ప్రాంతాల నుండి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని వారు వాపోయారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం సక్రమంగా పనిచేయకపోవడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకుని తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతూ ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్థుల సమస్యను స్పందనతో స్వీకరించిన ఎంపీడీఓ మోహన్ కుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పది పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు



**శ్రీకాకుళం క్రైం, మార్చి18(వార్త):** జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా, విద్యార్థులకు ఎటువంటి అంతరాయం లేకుండా జరిగేలా శ్రీకాకుళం జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పరీక్షా నియమాలు కచ్చితంగా పాటించేందుకు అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనవసరంగా గుమికూడకుండా చర్యలు తీసుకుంటూ, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు వ్రాయడానికి అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నారు.అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా పోలీసులు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు. పరీక్షలు సాఫీగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో పటిష్ట చర్యలు చేపట్టారు.

## మార్గదర్శులకు పురస్కారాలు

**శ్రీకాకుళం, మార్చి18 (వార్త):** జీరో పావర్టీ పీ4 కార్యక్రమం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన 'బంగారు కుటుంబాల' అభివృద్ధికి చేయూతనందించిన మార్గదర్శులను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో అవార్డులతో సత్కరించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ప్రారంభమై ఈ నెల 30 నాటికి ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా, విశేష సేవలందించిన వారిని గుర్తించి రాష్ట్ర స్థాయిలో ముగ్గురికి, జిల్లా స్థాయిలో నలుగురికి, నియోజకవర్గ స్థాయిలో ముగ్గురికి ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. అర్హులైన మార్గదర్శులు ఈనెల 20వ తేదీలోపు జీరో పావర్టీ పోర్టల్ ద్వారా లేదా జిల్లా చాప్టర్‌కు తమ నామినేషన్లను సమర్పించాలని ఆయన సూచించారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం

* ఎమ్మెల్యే కూన రవికుమార్
* బూర్జలో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం



**బూర్జ, మార్చి 19 (వార్త):** దివ్యాంగుల సంక్షేమం, అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం బూర్జ మండల కేంద్రంలో దివ్యాంగ శక్తి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా దివ్యాంగులు ఇకపై తమ రోజువారీ అవసరాలను సులభంగా తీర్చుకోగలరని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెరిగి, వారు సమాజంలో మరింత చురుకుగా పాల్గొనే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని ప్రతి అర్హుడు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు ఎం రమేష్, మాజీ ఎమ్మెల్సీ పి విశ్వ ప్రసాద్, మార్కెట్ డైరెక్టర్ ఆనేపు రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అసభ్యంగా ప్రవర్తిస్తే ఎదిరించండి

**శ్రీకాకుళం, మార్చి 18 (వార్త):** బాలల భద్రత కోసం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నాల్సా) రూపొందించిన 'స్నేహపూర్వక న్యాయ సేవలు' వారి రక్షణకు ఎంతగానో దోహదపడతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని ఆర్‌సీఎం సెయింట్ జాన్స్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంధువులు, స్నేహితులు లేదా ప్రయాణాల్లో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, శరీర భాగాలపై అనుచితంగా చేతులు వేసినా భయపడకుండా వెంటనే 'వద్దు' అని గట్టిగా చెప్పాలని హితవు పలికారు. ఇటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని, వీటికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఆపదలో ఉన్నప్పుడు లేదా వేధింపులకు గురైనప్పుడు విద్యార్థులు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీసు 100 లేదా ఉచిత న్యాయ సేవల నంబర్ 15100కు సమాచారం అందించాలని హరిబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, సిస్టర్ జ్యోత్స్న, టి. సుమంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 23, 24 తేదీల్లో షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఛైర్మన్ పర్యటన

**శ్రీకాకుళం, మార్చి 18 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఛైర్మన్ సొల్లా బొజ్జి రెడ్డి ఈ నెల 23, 24 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా 23న ఉదయం 6:25 గంటలకు అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకుని, అనంతరం 8:45 గంటలకు శ్రీకాకుళం బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అదే రోజు ఉదయం 10:30 గంటలకు మెలియాపుట్టిలోని లక్ష్మీ కళ్యాణ మండపంలో గిరిజనులతో బహిరంగ సభ నిర్వహించి వారి నుండి వినతులు స్వీకరిస్తారు. మార్చి 24న ఉదయం 9 గంటలకు గిరిజన సంఘాల ప్రతినిధులతో భేటీ అయిన తర్వాత, 10:30 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో గిరిజన సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు సీతంపేట ఐటీడీఏ గెస్ట్ హౌస్‌కు చేరుకుని, 25న పార్వతీపురం మన్యం జిల్లాలో అక్కడి టీటీడీ ఆలయం, హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాల, ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ సందర్శిస్తారు.

## సివిల్స్ విజేత రాముకు ఎస్పీ అభినందన

**శ్రీకాకుళం క్రైం, మార్చి 18 (వార్త):** సివిల్ సర్వీసెస్ పరీక్షలో 463వ ర్యాంక్ సాధించి విశేష ప్రతిభ కనబరిచిన జి. సిగడాం మండలం నడిమివలస గ్రామానికి చెందిన సౌరోతు రామును జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెంది, సాధారణ కుటుంబం నుండి వచ్చిన యువకుడు సివిల్ సర్వీసెస్‌లో ఉన్నత ర్యాంక్ సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. పట్టుదల, కృషి, నిబద్ధత ఉంటే పేదరికం వంటి ప్రతికూల పరిస్థితులను అధిగమించి విజయం సాధించవచ్చని రాము నిరూపించాడని కొనియాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి, అనంతరం ఎన్ఐటీ వరంగల్‌లో ఉన్నత విద్యను అభ్యసించి, నేడు రాము సాధించిన 463వ ర్యాంక్ ఆధారంగా అతనికి ఐపీఎస్, ఐఏఎస్ సేవల్లో ఎంపిక అయ్యే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏ సేవలో చేరినా ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తూ జిల్లాకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాము ప్రతి విద్యార్థికి ఒక గొప్ప ఆదర్శమని, తల్లి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ తన కొడుకును ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం ప్రశంసనీయమని తెలిపారు. తండ్రిని కోల్పోయిన తరువాత కూడా కుంగిపోకుండా సివిల్ సర్వీసెస్‌లో ర్యాంక్ సాధించడం గొప్ప విశేషమని పేర్కొన్నారు. జిల్లా యువత రామును ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** రంజాన్ పండుగను పురస్కరించుకుని బుధవారం శ్రీకాకుళం నగరంలో జిల్లా స్థాయి ఇఫ్తార్ విందును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ రోడ్డులోని శశి కన్వెన్షన్ హాల్ (జుడియో బిల్డింగ్ 4వ అంతస్తు)లో ఏర్పాటు చేశారు. ముందుగా మగ్రిబ్ నమాజ్‌తో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముస్లిం సోదరులు ఉద్దేశించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం బడుగు బలహీన మైనారిటీ సంక్షేమానికి కట్టుబడి ఉందని వారి అభివృద్ధికి అన్నివేళలా తోడ్పడుతుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న జామియా మసీదును అభివృద్ధి చేయుటకు అన్ని విధాల ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ముస్లిం సోదరులకు గతంలో మాదిరిగాని రంజాన్ తోఫా ఇవ్వాలని ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆర్థిక కారణాల వలన ప్రస్తుతం ఇవ్వలేక పోయినప్పటికీ దానిని కూడా గతంలో మాదిరిగా ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం మైనార్టీల ప్రభుత్వమని వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందనిన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్, డిఆర్ఓ లక్ష్మణమూర్తి, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షైక్ మహబూబ్ షరీఫ్, జిల్లాలోని ముస్లిం మత పెద్దలు జిల్లా ప్రెసిడెంట్, ఎస్.కె. నిజాత్ ముద్దీన్, వైస్ ప్రెసిడెంట్ బహదూర్ భాష, సెక్రెటరీ మహమ్మద్ యాసిన్, మాజీ ప్రెసిడెంట్, హాజి అమిరుల్ల బేగ్ , ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# పీఎన్ కాలనీ సీసీ రోడ్డు పనుల్లో.. అక్రమాలు

* అసిస్టెంట్ ఇంజనీర్‌పై విచారణ
* విజిలెన్స్ నివేదిక ఆధారంగా ప్రభుత్వ ఆదేశాలు
* విచారణ అధికారి నియామకం
* నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం




**శ్రీకాకుళం, మార్చి 18 (వార్త):** శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఎన్ కాలనీలో రోడ్డు నిర్మాణంలో అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి రావడంతో ప్రభుత్వం శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ చేసింది. పీఎన్ కాలనీ 9వ లేన్‌లో చేపట్టిన రోడ్డు పనుల్లో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని విజిలెన్స్ విభాగం నివేదికలో వెల్లడైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అప్పటి అసిస్టెంట్ ఇంజనీర్ జి.అప్పలనాయుడుపై చార్జ్‌లు నమోదు చేసి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ నిర్వహణ కోసం విశాఖపట్నం జివిఎంసీకి చెందిన సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.వి. పల్లం రాజును విచారణాధికారిగా నియమించారు. నెలరోజుల్లోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే, కేసును విచారణాధికారికి ముందు సమర్థంగా ప్రవేశపెట్టేందుకు శ్రీకాకుళం పబ్లిక్ హెల్త్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ప్రెజెంటింగ్ ఆఫీసర్‌గా నియమించారు. సంబంధిత రికార్డులు సేకరించి ప్రభుత్వ తరపున వాదనలు వినిపించాల్సి ఉంటుంది. ఇక ఈ రోడ్డు పనికి సంబంధించిన మొత్తం ఖర్చు, పొడవు, వెడల్పు వంటి సాంకేతిక వివరాలను ప్రభుత్వ ఉత్తర్వుల్లో వెల్లడించకపోవడం గమనార్హం. పనుల పరిమాణంపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. విజిలెన్స్ నివేదికలో పేర్కొన్న అంశాలను దృష్టిలో ఉంచుకుని పూర్తి స్థాయి విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

* డయేరియా వంటి ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలి
* డ్రైనేజీల్లోని పాత పైపులను యుద్ధ ప్రాతిపదికన తొలగించండి
* మంత్రి అచ్చెన్నాయుడు
* సాగును లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం
* జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్




**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల ప్రబలిన డయేరియా వంటి ఘటనలు జిల్లాలో మరెక్కడా పునరావృతం కాకుండా అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో డయేరియా నివారణ, వేసవి కార్యాచరణ, ఉపాధి హామీ పథకంపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రజారోగ్యం విషయంలో ఎక్కడా అలసత్వం వహించకూడదని, డ్రైనేజీ కాలువల గుండా వెళ్తున్న పాత మంచినీటి పైపులను ఇప్పటికే తొలగించే ప్రక్రియ ప్రారంభమైందని, మిగిలిన వాటిని కూడా తక్షణమే మార్చి కొత్తవి వేయాలని అధికారులను ఆదేశించారు. సీఐడీ సీజ్ చేసిన వంశధార షట్టర్లు విడుదల చేయడానికి ప్రయత్నిస్తున్నామని, గొట్టా బ్యారేజీ వద్ద ఎప్రాన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటలపై ప్రత్యేక దృష్టి సారించి సాగును లాభసాటిగా మార్చాలన్నారు. వ్యవసాయ విద్యుత్ రంగాన్ని ప్రోత్సహించాలని, ఉద్యోగులు ప్రజా సేవను ఒక గొప్ప అవకాశంగా భావించి ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. పారిశుధ్య పనుల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని, గ్రావెల్ కొరతను నిరోధించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ.. నాగావళి-వంశధార అనుసంధాన పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని కోరారు. అలాగే ఇచ్ఛాపురం నుంచి రణస్థలం వరకు 'పూర్వోదయ' పథకానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు.



ఉపాధి హామీ పనులపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను, ఒక పంచాయతీలో 20 పనులకే పరిమితి విధించడం వల్ల ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ప్రస్తావించారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. పనుల కొనసాగింపునకు ఎలాంటి ఆటంకం లేదని, ప్రారంభించిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. వంశధార నదిలో ఆక్రమణలను తొలగించాలని, మట్టి దిబ్బల వల్ల బూరవెల్లి వద్ద ఆర్ అండ్ బి రోడ్డు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు జొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటును, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఉపాధి హామీ సమస్యలను ప్రస్తావించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఉపాధి హామీ సిబ్బందికి న్యాయం చేయాలని, బిల్లుల అప్లోడింగ్ వేగవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో వాతావరణ శాఖ నివేదికల ప్రకారం ఈసారి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున, తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి హామీ పనులపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వారం, నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తున్నామని తెలిపారు. మంచినీటి కలుషితాన్ని నివారించేందుకు ప్రతిరోజూ క్లోరిన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, డయేరియా నివారణకు పైపుల లీకేజీల మరమ్మత్తు వంటి చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగ శక్తితో.. దివ్యాంగులకు లబ్ధి

* రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు దివ్యాంగులకు ఉచిత బస్సు
* జిల్లాలో ఉన్న బస్టాండ్‌ల వద్ద బస్ పాస్ జారీ చేసే కౌంటర్లు
* రాష్ట్రంలో గ్యాస్ సమస్య లేదు
* రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
* రాగోలులో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం



**శ్రీకాకుళం,మార్చి18(వార్త):** రాష్ట్రంలో 12.70 లక్షల మంది, శ్రీకాకుళం జిల్లాలో 42 వేల మంది దివ్యాంగులు దివ్యాంగ శక్తి పథకాన్ని వినియోగించుకోనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్‌లతో కలసి శ్రీకాకుళం నియోజకవర్గం రాగోలులో దివ్యాంగ శక్తి పథకానికి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రాగోలు నుండి శ్రీకాకుళం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ దివ్యాంగునితో మంత్రి మాట్లాడుతూ పెన్షన్ ఎంత వస్తుంది, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీకాకుళం ఆర్టీసి డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల కోసం ఉచిత బస్సు ప్రయాణానికి రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గుంటూరులో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రం మొత్తం మీద 175 నియోజక వర్గాలలో దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగ సోదరులకు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విడదీయరాని బంధమని గుర్తుచేశారు. పింఛను రెండు వందల నుండి పెంపు చేస్తూ 4 వేలు, వారికున్న శాతాన్ని బట్టి ఫింఛన్లు ఉంటాయన్నారు. దివ్యాంగులను ఆదుకునేది రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబేనన్నారు. వికలాంగులకు సమాజంలో గౌరవం, గుర్తింపు తీసుకువచ్చేది రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని చెప్పారు. ఎన్నికల ఉన్న మేనిఫెస్టే కాకుండా మేనిఫెస్టోలో లేని ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే స్త్రీ శక్తి పథకం సూపర్ హిట్ అయ్యిందన్నారు. డిశంబరు నెలలో దివ్యాంగ శక్తి పథకం ముఖ్యమంత్రికి ఆలోచన వస్తే మార్చి నెలలోనే అమలు చేసినట్లు పేర్కొన్నారు. 12.70 లక్షల మంది దివ్యాంగుల వినియోగించుకోనున్నట్లు తెలిపారు. రెండు లక్షల మంది మాత్రమే బస్సు పాసులు తీసుకున్నారు. దివ్యాంగ శక్తి పథకంతో అందరూ బస్సు పాస్ తీసుకోవచ్చన్నారు. జిల్లాలో 42 వేల మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. జిల్లాలో 3400 మంది బస్సు పాస్ లు తీసుకున్నట్లు చెప్పారు. గతంలో శ్రీకాకుళం, పలాస, టెక్కలి, డివిజన్ ల్లోనే బస్ పాస్ లు జారీ చేసే వారని, ఎక్కడైతో బస్టాండ్ లు ఉన్నాయో అన్ని బస్టాండ్ల వద్ద దివ్యాంగ శక్తి పథకంనకు సంబంధించి బస్సు పాస్ కౌంటర్లు ఏర్పాటు చేసి పాసులు జారీ చేస్తామన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు... ఆంధ్రప్రదేశ్ లో ఏ ప్రాంతానికైనా ఉచిత ప్రయాణం చేయవచ్చునన్నారు. పథకాల అమలుకు అందరూ సహకరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీజిఎస్ ద్వారా పథకాల అమలు విషయం తెలుసుకుంటున్నారని, పథకాల అమలులో సమస్యలు ఉంటే ముఖ్యమంత్రికి తెలియజేసుకునే అవకాశం ఉందన్నారు. ఇచ్చిన హామీలే కాదు ఇవ్వని హామీలు అమల్లోనూ సూపర్ హిట్ అయ్యిందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ లో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయని ఆరా తీసి ఆర్టీసీ కాంప్లెక్స్ ల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయుట, మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ఆర్టీసీ ఎండికీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడమైనదని, ఇటీవల విజయవాడలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులోనూ ఆర్టీసీ కాంప్లెక్స్ ల్లో మౌలిక సదుపాయాలు పై పర్యవేక్షణ చేసే విధంగా కలెక్టర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున అభినందనలు తెలియజేశారు. దివ్యాంగ శక్తి పథకాన్ని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం వలన ఎల్ పి జి గ్యాస్ సమస్య రాష్ట్రంలో లేదన్నారు. మహిళలకు గ్యాస్ సమస్య ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మూడు విడతల్లో రైతులకు నగదు జమ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ పింఛన్ల వారీగ చూస్తే జిల్లాలో 32 వేల మంది ఫింఛన్లు తీసుకుంటున్నారన్నారు. ఆర్టీసి వద్ద ఫ్రీ బస్సు పాసు తీసుకోవాలని దివ్యాంగులను కోరారు. జిల్లాలో పాసులు జారీకి ఏర్పాటు చేసిన కౌంటర్లు వద్ద తీసుకోవాలన్నారు. కొంత మంది దివ్యాంగులు బస్సులు ఎక్కలేకపోతున్నారని వారి కోసం ర్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతీ శుక్రవారం స్వాభిమాన్ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనదని, వారికి ఉద్యోగ, ఉపాధి సమస్యలు, ట్రై బ్యాటరీ సైకిల్, తదితర సమస్యలు పరిష్కారం జరుగుతోందన్నారు. స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంద్రధనస్సు కార్యక్రమం ప్రకటించినట్లు గుర్తు చేశారు. దివ్యాంగులకు ఫింఛన్లు, దివ్యాంగుల కోసం స్వాభిమాన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ద్వారా దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగ శక్తి పథకాన్ని దివ్యాంగులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ మాట్లాడుతూ శత శాతం వైకల్యం ఉన్న వారికి అటెండెంట్లుకు రాయితీ ఉంటుందన్నారు. నాన్ స్టాప్, ఎసి బస్సుల్లో రాయితీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎడ్యుకేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ డైరెక్టర్ పిఎంజె బాబు, జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ, డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ, దివ్యాంగుల శాఖ ఎడి బి. శైలజ, పిఆర్ఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546